

నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 133 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
25-03-2026 బుధవారం వెల : 1/- పేజీలు : 4



గతంలో ఇచ్చిన ఎస్టీ సర్టిఫికెట్లు



"1973-2003 మధ్య బెంతో ఒడియా సమాజానికి కుల ధృవీకరణ పత్రాలు జారీ చేసినట్లు టెక్కలి ఆర్డీవో ధృవీకరణ"

# పోరాటమే శరణ్యమా..?

- సమస్యలను ఆలకించరా.??
- వినతి పత్రంను స్వీకరించరా..?
- ఇదెక్కడి న్యాయమంటూ ప్రశ్నిస్తున్న బెంతు ఒడియా సమాజం
- అధికారులు జవాబు చెప్పేలా సంఘితం అవుతామంటున్న ప్రతినిధులు

**(నవతరం ప్రతినిధి-శ్రీకాకుళం)**

సోంపేట నుంచి ఇచ్ఛాపురం వరకు, ముఖ్యంగా కవిటి మండల ప్రాంతంలో నివసిస్తున్న బెంతో ఒడియా సమాజం ఎన్నో దశాబ్దాలుగా ఒక మౌన పోరాటం చేస్తోంది. ఇది కేవలం ఒక కుల ధృవీకరణ పత్రం సమస్య కాదు. ఇది ఒక సమాజం విద్యను కోల్పోతున్న కథ. ఉద్యోగాలను కోల్పోతున్న వాస్తవం. ప్రభుత్వ పథకాల నుంచి దూరమవుతున్న దురదృష్టం. భవిష్యత్తు ముందే మూసుకుపోతున్న పరిస్థితి.

ఆంధ్రప్రదేశ్ గిరిజన జాబితాలో సీరియల్ నెంబర్ 17లో బెంతో ఒడియా పేరు ఉంది. తండ్రుల తరానికి, తాతల తరానికి ఎస్టీ ధృవీకరణ పత్రాలు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. కానీ 2001 తర్వాత నుంచి ఈ సమాజానికి ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వడం పూర్తిగా ఆగిపోయిందని అనేక కుటుంబాలు చెబుతున్నాయి. అసలు ఎందుకు ఆపారో కూడా ఎవరూ స్పష్టంగా చెప్పడం లేదు. సాధారణంగా ఒక వ్యక్తి ఎంఆర్వో కార్యాలయానికి వెళ్లి కుల ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేస్తే, అధికారుల విధి స్పష్టంగా ఉంటుంది. పరిశీలన తర్వాత సర్టిఫికెట్ ఇవ్వాలి. ఒకవేళ ఇవ్వకపోతే, ఎందుకు ఇవ్వడం లేదో రాతపూర్వకంగా తెలియజేయాలి.

కానీ బెంతో ఒడియా సమాజం విషయంలో జరుగుతున్నది ఇంకా బాధాకరం.సర్టిఫికెట్ లేదు.స్పష్టత లేదు.రాతపూర్వక సమాధానం లేదు.సానుభూతి లేదు.స్పందన లేదు.ఇవన్నీ చాలవన్నట్లు, ఈరోజు జరిగిన ఘటన మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో, శ్రీకాకుళం జిల్లా పరిషత్‌లో కుల ధృవీకరణ పత్రం సమస్యపై ఫిర్యాదు అందించడానికి బెంతో ఒడియా సమాజ ప్రతినిధులు సుమన్ బిసాయి , గుణనిధి ధోలై వెళ్లారు. కానీ అక్కడ కూడా అధికారుల స్పందన కనిపించలేదు. ఫిర్యాదు స్వీకరించడానికి "ఎలాంటి ఆప్షన్ లేదు" అని చెప్పి, అభ్యర్థన పత్రాన్నే తీసుకోవడానికి నిరాకరించారు. వినతిపత్రంపైనే No Option అని రాసి తిరిగి ఇచ్చేశారు.ఈ ఒక్క ఘటన ఎన్నో ప్రశ్నలు లేవనెత్తుతోంది.ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో, ప్రజలు తమ సమస్య చెప్పడానికి వచ్చే గ్రీవెన్స్ వేదికలో కూడా ఫిర్యాదు తీసుకోకపోతే, మరి వారు ఎక్కడికి వెళ్లాలి?హక్కు కోసం అభ్యర్థన ఇస్తే, "ఆప్షన్ లేదు" అని వెనక్కి పంపిస్తే, మరి ఆ సమాజం ఏ దారిని చూడాలి?ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేదికలో కూడా వినతి స్వీకరించకపోతే, ఇది నిర్లక్ష్యమా? అవమానమా? లేక ఒక వెనుకబడిన సమాజం వేదనపై నిర్మానుష్య వైఖరా?ఈ సమస్య తీవ్రతను బయటివారు పూర్తిగా అర్థం చేసుకోకపోవచ్చు. కానీ బెంతో ఒడియా సమాజంలోని పేద కుటుంబాలకు

ఇది జీవితాన్ని నిర్ణయించే సమస్య. పాఠశాల స్థాయిలోనే పలు చోట్ల కుల వివరాలు అడుగుతారు. పదో తరగతి తర్వాత ఉన్నత చదువుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ హాస్టళ్లు, విద్యాసదుపాయాలు అన్నీ ఈ ధృవీకరణ పత్రంతో ముడిపడి ఉంటాయి. గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి గది అద్దెకు తీసుకుని చదవడం ఒక పేద కుటుంబానికి ఎంత కష్టమో అందరికీ తెలిసిందే. కుల ధృవీకరణ పత్రం ఉంటే ప్రభుత్వం ఇచ్చే వసతిగృహాల్లో ఉండి చదివే అవకాశం ఉండేది. కానీ ఈ సమాజానికి ఆ తలుపు మూసుకుపోయింది. దాంతో చాలా మంది విద్యార్థుల చదువు పదో తరగతి దాటక ముందే ఆగిపోతోంది.

ఇదే పరిస్థితి ఉద్యోగాల్లోనూ కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగం కావాలంటే కుల ధృవీకరణ పత్రం అవసరం. రిజర్వేషన్లు పొందాలంటే అది అవసరం. ప్రభుత్వ పథకాలు పొందాలంటే కూడా అవసరం. స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు తీసుకోవాలన్నా కూడా అవసరం. అంటే ఒక సర్టిఫికెట్ లేకపోవడం వల్ల ఒక తరం అవకాశాలన్నీ కోల్పోతోంది.

బెంతో ఒడియా సమాజంలోని మేజారిటీ కుటుంబాలు పేదవే. చాలామందికి సరైన ఆహారం కూడా కష్టమే. అలాంటి పరిస్థితిలో ఉన్న పిల్లలకు విద్య, హాస్టల్, ఫీజు రీయింబర్స్‌మెంట్, సంక్షేమ పథకాలు అందకపోతే వారి భవిష్యత్తు ఎలా మారుతుంది?అందుకే ఇప్పుడు ఒక గంభీరమైన



పిలుపు అవసరం -బెంతో ఒడియా మేలుకో.మేలుకోవడం అంటే కేవలం బాధపడటం కాదు.మేలుకోవడం అంటే సంఘటితమవడం.ఆధారాలు సేకరించడం.పాత సర్టిఫికెట్లు కూడబెట్టడం.ప్రతి గ్రామం నుంచి కుటుంబ వివరాలు సేకరించడం.అధికారులను ప్రశ్నించడం.

రాతపూర్వక సమాధానం కోరడం.అవసరమైతే చట్టపరంగా పోరాడడం.మీడియా ముందుకు రావడం.ప్రజాప్రతినిధులను నిలదీయడం వంటి కార్యక్రమాలను చేయాలని సామాజిక వర్గ ప్రతినిధులు సమాయత్తం అవుతున్నారు.

ఈరోజు గ్రీవెన్స్‌లో No Option అని రాసి వినతిపత్రం వెనక్కి ఇచ్చేయడం ఒక పేపర్‌పై రాసిన మాట మాత్రమే కాదు -అది ఒక సమాజం బాధను వ్యవస్థ ఎలా తిరస్కరిస్తోందో చూపించే చేదు సంకేతం.కానీ ఇదే చివరి మాట కాకూడదు. ఇదే పోరాటానికి ఆరంభం కావాలి. ఇదే యువతకు మేలుకొలుపు కావాలి.ఇదే సమాజాన్ని ఒకే వేదికపైకి తేవాలి. బెంతో ఒడియా యువకులారా, విద్యార్థులారా, తల్లిదండ్రులారా - ఇంకా మౌనం వద్దు.

ఈరోజు No Option అన్నారు. రేపు మనం సంఘటితంగా నిలిస్తే, అదే వ్యవస్థ సమాధానం చెప్పాల్సి వస్తుంది.

మన సమస్యను మనమే పట్టించుకోకపోతే, మరెవ్వరూ పట్టించుకోరు.మన హక్కు కోసం మనమే నిలబడాలి.

బెంతో ఒడియా మేలుకో...నీ హక్కు కోసం మేలుకో...నీ చదువు కోసం మేలుకో...నీ ఉద్యోగం కోసం మేలుకో...

నీ పిల్లల భవిష్యత్తు కోసం మేలుకో...

ఈరోజు No Option అన్నారు...

రేపు "ఇదిగో మీ హక్కు" అని చెప్పే వరకూ పోరాడుదాం. అని వారు యువతకు పిలుపు నిచ్చారు.

# ఆయా శాఖల్లో ఎస్సీ రోస్టర్ పాయింట్ అమలు చేయాలి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు సీతారాం

2లో



# అక్రిడేషన్‌పై కలెక్టర్‌కు వినతి

- సీనియర్ జర్నలిస్టుల భేటీ
- చిన్న పత్రికలకు సడలింపులు ఇవ్వాలని విజ్ఞప్తి
- 70% హాజరు పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్
- (1+3) విధానంలో అక్రిడేషన్ మంజూరు చేయాలని కోరిన జర్నలిస్టులు

**నవతరం శ్రీకాకుళం**

జిల్లాలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ మంజూరు చేయాలని కోరుతూ సీనియర్ పాత్రికేయులు, పత్రికా సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రిడేషన్ కమిటీ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని పేర్కొన్నారు. పెద్ద పత్రికలు, ఛానళ్లకు 435కి పైగా అక్రిడేషన్లు మంజూరు చేసినప్పటికీ, గతంలో జిల్లాలో 1600 మందికి పైగా అక్రిడేషన్లు ఇచ్చిన పరిస్థితి ఇప్పుడు లేదని



తెలిపారు.

ప్రస్తుతం నిబంధనలు కఠినతరం కావడంతో చిన్న పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత నాలుగేళ్లుగా చిన్న పత్రికలు కష్టనష్టాలతో ప్రచురణ కొనసాగిస్తున్నప్పటికీ, అందులో పనిచేస్తున్న ఎడిటర్లు, న్యూస్ బ్యూరో సభ్యులు సీనియర్ జర్నలిస్టులేనని తెలిపారు.

అక్రిడేషన్ మంజూరులో అటెండెన్స్ నిబంధనలను కొంత సడలించి, గత కొన్ని -మిగతా 2లో

ఎడిటోరియల్

# గాడిదగుడ్డు ప్రవచనం

మన దేశంలో తరతరాలుగా సమాజంలో ఉన్నతులమను కొనేవారు ప్రబోధిస్తున్న, ప్రవచిస్తున్న గొప్ప మాటలు విని తరించి, భరించి తన్మయత్వంలో వాస్తవిక జగత్తునే మర్చిపోయాం. పోతున్నాం కూడా. జగత్తు మిధ్య పలాయనం మిధ్య సిద్ధాంతాల పరంపరలో ఇంతకుమించి ఏముంటుంది! ఇప్పటికయినా ఒంటికి, తలకింటికి అర్థం కావాల్సింది ఏమిటంటే, ధర్మ ప్రబోధాల పేరుతో పండిత ఉద్ధండులు ఒలకబోస్తున్న అజ్ఞానం అవాంచనీయం ఎంతన్నదే తెలుసుకోవాల్సి ఉంది. ఇంతకంటే కుసంస్కార ప్రవచనం వేరే ఉంటుందా! ''బడిలో పిల్లోడు చదివితే చదువతాడు లేకుంటే పోతాడు! వాడికి మధ్యాహ్న భోజనమేమిటి? ఆ భోజనంలో గుడ్డేమిటి! గాడిద గుడ్డు అసహ్యకరంగా! ఆ గుడ్డుకు లెక్కలు.. డొక్కలు, దుస్తులిచ్చి, పుస్తకాలిచ్చి, అన్నంపెట్టి గాడిదగుడ్డూ పెట్టి కూచోపెడితే, వాడిక చదువుతాడా? పెళ్లి కొడుకులా కూర్చోపెడతారా? అసలు బళ్లో తిండి పెట్టడమేమిటి?'' ఇది మన వేదాధ్యయన ప్రవచనకారుని తలనిండా నింపుకున్న జ్ఞానం. ఇలాంటివి చెప్పే తరతరాలుగా సమాజంలోని అధిక భాగాన్ని చదువుకు దూరం చేశారు. కడుపునిండా తిండికి దూరం చేశారు. కడుపు నిండా తినగలిగి ఉన్నవారే చదువుకోవడానికి అర్హులని నిర్ణయించేశారు! అంతేకాదు, చదువుకున్నవాడు, తినికూచుని ఇలా మాటలు, బోధలు మాత్రమే చేయాలనీ నియమం చేశారు. ఇది అగ్రవర్ణుల అహంకారపూరిత హూంకారం. ఈ దేశంలో స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా సమాన హక్కులు, సమానత్వం అందరికీ చెందినవిగా ఉండాలనుకున్న రాజ్యాంగం అమలులోకి వచ్చినా, ఇంకా పేదరికం, ఆకలి, అవిద్య, అనారోగ్యం వెంటాడుతూనే ఉంది. రెండు పూటలా తినేందుకు బుక్కెడు అన్నం దొరకని అభాగ్యులు ఇప్పటికీ కోకొల్లలు. ఇక పిల్లల్లో పోషకాహారలోపం, రక్తహీనత, వయసుకు తగిన బరువులేకపోవడం, విటమిన్ లోపాలతో, భావిభారతం కొనసాగుతూనే ఉన్నది.

పేదరికంలో ఉన్న ప్రజలు వారి పిల్లలను బడులకు పంపే పరిస్థితిలేదు. దానికి బదులు పనులకు పెట్టడాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితులను గమనించి మన అత్యున్నత న్యాయస్థానం. ప్రతివారికి ఆహారం హక్కుగా ఉండాలని, పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వాలు అమలుపరచాలని ఆదేశించింది. ఇప్పుడు మన ప్రవచనకారుడు, న్యాయస్థాన తీర్పును అపహాస్యం చేయడం మహానేరం కాదా! పేదవాళ్ల ఆకలిని, పేదరికాన్ని హేళన చేస్తూ వారి హక్కులపై దాడి చేయటం ఈ గరకపాటి వారితోనే మొదలయింది కాదు, పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అనేకమంది చదువుతున్న పండితులు, వారు సోమరిపోతులుగా తయారవుతారని ప్రేలాపించడం చూశాం మనం. బడాబాబులు చేసిన అప్పులను ప్రభుత్వం మాఫీ చేయడాన్ని, కంపెనీలకు సబ్సిడీలు ఇవ్వడాన్ని మాత్రం వీరు ప్రశ్నించరు.

అసలు పిల్లలకు భోజనం పెట్టడమేమిటి? అని ప్రశ్నించడం, గుడ్డుపెట్టేవాడికి బుద్ధుందా! అని తిట్టడం వెనకాల ఎంత ద్వేషం కడుపులో ఉందో! దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతుల పిల్లలకు అసలు చదువును నిరాకరించాలనే ఆలోచనలే దీనికి కారణం. అన్నీ సంపుష్టిగా ఉన్నవారే చదువుకు అర్హులనే భావనే అందులో కనిపిస్తున్నది. దారిద్ర్యం అనుభవించేవారికి కూడా చదువుకునే అవకాశాన్ని కల్పించేందుకు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. అంబేద్కర్ ఆధ్వర్యంలో ఏర్పరచుకున్న భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కు ఇది. ఆహారం, విద్య పొందటం అనేవి దయాదాక్షిణ్యాలమీద ఇచ్చే భిక్షకాదు, అది హక్కు.

తరతరాలుగా శ్రామికులు సృష్టిస్తున్న సంపదను తమ వెనకాల వేసుకుని, సకల భోగాలు అనుభవిస్తూ బొజ్జలు పెంచిన జ్ఞాన ప్రవచనాలు ఇలానే ఉంటాయి. ఈ జ్ఞాన బోధకులు అసలైన నేరస్తులు, దుర్మార్గులు, అవినీతిపరుల మీద పల్లెత్తుమాట మాట్లాడరు. అన్యాయంగా దేశాలపై దాడులు చేస్తున్న సామ్రాజ్యవాద దేశాల గూర్చి కానీ, మానవ హననాన్ని గూర్చికానీ, పసిపిల్లలను నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్న యుద్ధ పిపాసులనూ ఏమీ అనరు. మహిళల వేషధారణల గూర్చి, కుల వివక్షతతో కూడిన వ్యాఖ్యలు చేయడం తప్ప, అసలు పేదరికానికి, ఆకలికి కారణాల జోలికే వెళ్లరు. వెటకారాలు, మూతివిరుపులు, ముచ్చుపలుకులు. ఇవీ ఉన్నత విద్యా పారంగతుల మనుకునే వారి ప్రవచనాంశాలు. వాళ్లకంటే కూడా, అట్లాంటి బోధకులను అనుసరిస్తున్న, వింటున్న అశేష ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది. విద్యార్థుల పట్ల అనుచితంగా మాట్లాడిన వారు క్షమాపణలు చెప్పాలి.

# తే 30.3.2026ది సోమవారం హుండీ లెక్కింపు

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం, ఆలయ హుండీలను సంబంధిత శాఖ అధికారులు, అనువంశిక ధర్మకర్త, అర్చకులు, భక్తులు, మరియు గ్రామ పెద్దలు సమక్షంలో తేదీ 30. 3. 2026 సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో గల హుండీలను తెరుచుట జరుగుతుందని దేవాదాయ శాఖ, ఆలయ ఉప కమిషనర్, మరియు కార్య నిర్వాహణ అధికారి, కె. ఎన్ .వి .డి .వి. ప్రసాద్, ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# అక్రిడేషన్‌పై కలెక్టర్‌కు వినతి

మొదటిపేజీ తరువాయి

సంవత్సరాలుగా నిరంతరంగా ప్రచురణ చేస్తున్న పత్రికలకు 70 శాతం హాజరును పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో అమలు చేస్తున్న సడలింపులను శ్రీకాకుళం జిల్లాలో కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా చిన్న పత్రికల్లో పనిచేస్తున్న వారికి డివిజన్‌కు కనీసం ఒక రిపోర్టర్ చొప్పున (1+3) విధానంలో అక్రిడేషన్ మంజూరు చేయాలని కోరారు. జర్నలిజాన్ని వృత్తిగా భావించి పనిచేస్తున్న పాత్రికేయులకు నిబంధనల్లో కొంత సడలింపు కల్పించి, సంబంధిత అధికారులకు తగిన మార్గదర్శకాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల ఎడిటర్లు, సీనియర్ పాత్రికేయులు, పత్రికా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మందసలో మట్టి మాఫియాకు అధికారుల చెక్





**నవతరం -శ్రీకాకుళం**

- అర్థరాత్రి మెరుపుదాడులు..
- జేసీబీలు, టిప్పర్లు అడ్డుకట్ట...
- డ్రైవర్లు పరారీ
- వాహనాల నంబర్లతో కేసులు నమోదు!
- తహశీల్దార్ మిస్క శ్రీకాంత్ ఆదేశాలతో రెవెన్యూ పోలీసుల సంయుక్త చర్యలు...
- మందస, గోవిందపురం ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు...

శ్రీకాకుళం జిల్లా మందస మండలంలో మట్టి, గ్రావెల్ మాఫియాపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. తహశీల్దార్ మిస్క శ్రీకాంత్ ఆదేశాల మేరకు సోమవారం అర్ధరాత్రి మందస, గోవిందపురం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ముఠాపై సంయుక్త దాడులు నిర్వహించారు.

మందస ఎంఆర్ఐ ఇందిర, వీఆర్వో భవానీ, సర్వేయర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి అకస్మాత్తుగా రంగంలోకి దిగడంతో మాఫియా గుంపు ఉలిక్కిపడింది. తవ్వకాల కోసం వినియోగిస్తున్న జేసీబీ, ట్రాక్టర్, మట్టి లోడ్ టిప్పర్, ఖాళీ టిప్పర్లను అధికారులు అడ్డుకున్నారు.

అయితే అధికారులు చేరుకునేలోపే డ్రైవర్లు పరిస్థితిని గమనించి జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లతో అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో వాహనాలను స్వాధీనం చేసుకునే అవకాశం లేకపోయినా, నంబర్ల ఆధారంగా కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు.

అక్రమ తవ్వకాలలో వినియోగించిన వాహనాల నంబర్లు సేకరించి మందస పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు ఎంఆర్ఐ ఇందిర, వీఆర్వో భవానీలు అధికారికంగా ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈ దాడుల్లో గుర్తించిన వాహనాలు:

టిప్పర్లు: AP39WA1989, AP39UU957
ట్రాక్టర్: AP39UR2247 (మట్టి లోడుతో)
జేసీబీ: TO226AP41395

మండలంలో ఇటీవలి కాలంలో మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారుల ఈ చర్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. అనుమతులు లేకుండా ప్రకృతి సంపదను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

రాబోయే రోజుల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై మరింత గట్టిగా నిఘా ఉంచి, దోషులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు.

# ఆయా శాఖల్లో ఎస్సీ రోస్టర్ పాయింట్ అమలు చేయాలి

**నవతరం -శ్రీకాకుళం**

ఆయా శాఖల్లో ఎస్సీ రోస్టర్ పాయింట్ తప్పనిసరిగా అమలు జరగాలని రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యులు రావాడ సీతారాం అధికారులను కోరారు. వైద్య ఆరోగ్య శాఖ, ఐఐఐటి, మున్సిపల్ కార్పొరేషన్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, ఎపిఈపీడిసియల్, తదితర శాఖల అధికారులతో ఆయన ఎస్సీ రోస్టర్ పాయింట్ అమలు పై మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలలో రోస్టర్ పాయింట్ అమలు చేయాలని కోరారు. 2022 నుండి ఐఐఐటి లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి తెలియజేసిన వివరాలుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వారం రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక అందజేయాలన్నారు. ఈ ప్రాంతంలో బిఈ, బిటెక్, ఎంటెక్ పూర్తి చేసిన వారు ఉపాధి లేక ఖాళీ గా ఉన్నట్లు చెప్పారు. రిమ్స్ లో 2022 నుండి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి రోస్టర్ విషయంపై ఆరా తీశారు. పోస్టులు వారీగా రోస్టర్ పాయింట్ జరుగుతున్న అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పాయింట్ల వారీగ జాబితా అందజేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో 2022 నుండి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎస్సీ రోస్టర్ పాయింట్ అమలు గూర్చి కమీషన్ సభ్యులు అడుగగా జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టిన రిక్రూట్‌మెంట్ పై డిఎంహెచ్ఓ డాక్టర్ అనిత వివరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో 2022 నుండి రిక్రూట్‌మెంట్ జరగలేదని పరిపాలనాధికారి చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదు అందినదని, కింది స్థాయిలో పోస్టులు తీసినట్లు కమీషన్ సభ్యులు సీతారాం తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ఎస్సీ రోస్టర్ పాయింట్లు అమలు గూర్చి అడిగి తెలుసుకొని రోస్టర్ పాయింట్ అమలు జరగాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్న పనులు విషయం పై ఈ ప్రొక్యూర్ మెంట్ లో ఎస్సీ కోటాను అమలు చేయాలన్నారు. 2022 నుండి ఇప్పటి వరకు ఎంత బడ్జెట్ ఇందులో 20 శాతం పనులు ఎస్సీలకు కేటాయించారా లేదా బడ్జెట్ వివరాలు కోరారు. ఎపిఈపీడిసియల్ ఎస్ఈ కృష్ణమూర్తి రోస్టర్ పాయింట్ అమలు పై వివరించారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె. వినాయకం, ఆయా శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు, కార్యాలయాల పరిపాలనాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కారం చూపాలి

- ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి.
- విజిబుల్ పోలీసింగ్, ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలపై దృష్టి సారించాలి.
- జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్.



**నవతరం -శ్రీకాకుళం**

పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించిన ప్రజా ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు చేపట్టి, ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పారదర్శకంగా పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారు పోలీసు అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులతో కలిసి ఎస్పీ గారు పీజీఆర్ఎస్ ఫిర్యాదులు,విజిబుల్ పోలీసింగ్,ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు, కార్యాలయ పరిపాలన విధానం మరియు కోర్టు సంబంధిత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.పరిపాలన మరియు పోలీసు సిబ్బందికి సంబంధించిన అన్ని అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ ఆఫీస్ విధానం ప్రకారం జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ల పనితీరును డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతి రోజు గ్రామాలలో సందర్శనలు నిర్వహించి, ప్రజలతో మమేకమై ముఖ్య కూడళ్లలో 'నారీ శక్తి సంకల్పం' పేరిట మహిళలు, బాలికల భద్రత, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.బాణాసంచా తయారీ, విక్రయాలు మరియు నిల్వ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి, నియమ నిబంధనలు, అనుమతులు మరియు లైసెన్సులను కచ్చితంగా పరిశీలించాలని ఆదేశించారుముఖ్యమైన కేసుల దర్యాప్తులో కీలక ఆధారాలను సేకరించి, నిర్ణీత కాలవ్యవధిలో కోర్టులో అభియోగ పత్రాలు (చార్జ్‌షీట్లు) దాఖలు చేయాలని ఆదేశించారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్లను తక్షణమే అమలు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ చర్యల్లో భాగంగా హెల్మెట్ ధారణపై విస్తృత అవగాహన కల్పించి, డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు ఓపెన్ డ్రింకింగ్‌పై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే, రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ కె.వి. రమణ,డీఎస్పీలు వివేకానంద,లక్ష్మణరావు, గోవిందరావు మరియు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



# జీవితాలను మలిచిన గురువు రామినాయుడు

- వెలుగు నింపిన వాక్యం... రామినాయుడు జీవితం
- వేలాది జీవితాల్లో ఆశల దీపాలు వెలిగించిన మార్గదర్శి
- కెరీర్ కౌన్సిలింగ్‌తో యువత భవిష్యత్తుకు దిక్సూచి
- ఉపాధ్యాయులకు శిక్షణలో అపార అనుభవం
- మాటతో మలిచే మోటివేషనల్ స్పీకర్‌గా గుర్తింపు
- విలువలతో కూడిన విద్యకు జీవితాంతం కట్టుబాటు
- పురాణాలు, ఇతిహాసాల సారాన్ని జీవనంలో అన్వయించిన గురువు
- సాధారణ గ్రామం నుంచి అసాధారణ శిఖరాలకు ప్రయాణం
- నేటికీ వేలాది హృదయాల్లో నిలిచిన స్ఫూర్తి వ్యక్తిత్వం
- పుట్టిన రోజు సందర్భంగా నవతరం ప్రత్యేక కథనం

కొంతమంది గురువులు పాఠాలు చెబుతారు... మరికొంత మంది మార్కులు తెప్పిస్తారు.. కానీ చాలా అరుదుగా కొంతమంది మనిషి జీవితాన్ని మళ్లీ పుట్టినట్టు మార్చేస్తారు.
ఆ అరుదైన గురువులలో ముందుగా నిలిచే పేరు సీపాన రామినాయుడు.
ఆయన ఒక ఉపాధ్యాయుడు కాదు ఒక శిఖరం.
ఆయన ఒక స్పీకర్ కాదు ఒక శక్తి.
ఆయన మాట ఒక సలహా కాదు ఒక జీవితాన్ని మలిచే మలుపు.
విఫలమై కూర్చున్న విద్యార్థి ముందుకు రావడానికి ధైర్యం కావాలి...
ఆ ధైర్యం ఇచ్చే స్వరం రామినాయుడు.
నమ్మకం కోల్పోయిన యువకుడికి ఒక మాట చాలు...
ఆ ఒక్క మాటతో జీవితాన్ని మళ్లీ వెలిగించే గురువు రామినాయుడు.
ఈ రోజు ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ శిష్యులు, అనుచరులు భావోద్వేగంగా చెబుతున్న మాట ఒకటే
"మా జీవితాల్లో వెలుగు మళ్లీ వెలిగింది అంటే...
అది రామినాయుడు గారి వల్లే."



**(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)**

జీవితాల్లో ఓ దశలో ప్రతి ఒక్కరూ చీకటి చూస్తారు...ఆ చీకటిలో దారి కనిపించక నిలిచిపోతారు...అప్పుడు ఒక వ్యక్తి ముందుకు వచ్చి "నీకు దారి ఉంది" అని చూపిస్తే అతడు గురువు కాదు... జీవితం మలిచే శక్తి.అలాంటి శక్తిగా వేలాది మంది జీవితాల్లో నిలిచిన పేరు.. సీపాన.రామినాయుడు.

### మట్టిలో మొలిచిన విత్తనం... శిఖరాన్ని తాకిన వృక్షం

శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం రేగుపాడు...సాధారణ గ్రామం...కానీ అక్కడి నేలలో మొలిచిన ఒక చిన్న విత్తనం. నేడు వేలాది జీవితాలకు నీడనిచ్చే వృక్షంగా ఎదిగింది. కీర్తిశేషులు కేశవరావు మాస్టారు, లక్ష్మీనారాయణమ్మ దంపతుల విలువలు ఆయనను తీర్చిదిద్దాయి. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, సేవాభావం ఆయనలో బలంగా నాటుకుపోయాయి.

### ఉద్యోగం కాదు... ఉద్యమం ఎంచుకున్న వ్యక్తి

ఎం.బీ.ఏ పూర్తి చేసిన తర్వాత అందరూ ఉద్యోగాల కోసం పరుగులు తీస్తున్న సమయంలో ఆయన మాత్రం ఒక విభిన్నమైన నిర్ణయం తీసుకున్నారు.
"నేను ఒక్కరిని కాదు... వందల మందిని నిలబెట్టాలి" అనే సంకల్పంతో విద్యారంగంలోకి అడుగుపెట్టారు. 2002లో ప్రారంభమైన ఆయన ప్రయాణం ఇప్పటికే వేలాది విజయ గాథలకు పునాది వేసింది.

### విఫలాన్ని విజయంగా మలిచిన గురువు

పాఠాలు చెప్పడం సులువు...కానీ ఒక విద్యార్థిలో దాగి ఉన్న ఆత్మవిశ్వాసాన్ని వెలికితీయడం కష్టం. విద్యార్థి విఫలమైతే చాలామంది దూరంగా వెళ్లిపోతారు...
కానీ రామినాయుడు మాత్రం దగ్గరగా వస్తారు. "ఇది అంతం కాదు... ఇది ఆరంభం" అని చెబుతారు. అందుకే విఫలమైన వారు ఆయన దగ్గరకు వస్తారు... విజయవంతులై బయటకు వెళ్తారు.

### మాటలో మంత్రం... బోధనలో జీవం

"నువ్వు చేయలేవు" అని ప్రపంచం చెప్పినప్పుడు, "నువ్వు తప్పక చేస్తావు" అని నమ్మకం నింపే స్వరం ఆయనది. పురాణాలు, ఇతిహాసాలపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన ఆయన బోధనకు ప్రత్యేక శక్తిని ఇస్తుంది. రామాయణం, మహాభారతం కథలు ఆయన చేతిలో జీవితానికి దారులు చూపే మార్గాలుగా మారిపోతాయి. అందుకే ఆయన క్లాస్ ఒక లెక్చర్ కాదు...ఒక అనుభూతి... ఒక మార్పు... ఒక కొత్త ప్రారంభం.



### ఇంట్లో తండ్రి... బయట అందరికీ ఆధారం

ఇంట్లో ప్రేమతో నిండిన తండ్రి.
పిల్లలకు మార్గం చూపే ఆదర్శం. విద్యారంగంలో తోటి మహిళా ఉపాధ్యాయులకు ఒక అన్నలా అండగా నిలిచే వ్యక్తి. ఆ పదలో ఉన్నవారికి ముందుండి సహాయం చేసే మనసు. ఎవరైనా కష్టంలో ఉన్నారని తెలిసినా ముందుగా చేరేది ఆయననే అంటారు. అందుకే కొందరికి గురువు...
కొందరికి అన్న... మరికొందరికి దేవుడిలా కనిపించే వ్యక్తి రామినాయుడు.

### ఒక వ్యక్తి కాదు... ఒక ప్రభావం

వేలాది మంది విద్యార్థులు.. నిరుద్యోగులు.. ఉపాధ్యాయులు... తమ జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటే వారి కళ్లలో ఆనందంతో పాటు కృతజ్ఞత కనిపిస్తుంది.ఒక మనిషి గొప్పతనం అతని పదవిలో కాదు...అతను మార్చిన జీవితాల్లో ఉంటుంది. ఆ అర్థంలో చూస్తే రామినాయుడు ఒక వ్యక్తి కాదు... ఒక ప్రభావం .. ఒక గురువు కాదు... ఒక ఉద్యమం.
జీవితంలో సంపాదించేది సంపద కాదు...మన వల్ల నిలబెట్టిన మనుషులే నిజమైన సంపద. ఆ సంపదను సంపాదించిన గురువు సీపాన రామినాయుడు.
ఇంకా ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపుతూ, మరెందరికో దిశ చూపేలా ఆయన ప్రయాణం కొనసాగాలని ఆకాంక్షిస్తూ, రామినాయుడికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తోంది నవతరం పత్రిక యాజమాన్యం.

# మనసెరిగిన మాధవుడు - ఆశా కుటుంబ కథ ??



ఒక చిన్న పట్టణంలో ఆశ అనే అమ్మాయి తన కుటుంబంతో కలిసి జీవిస్తోంది. ఆమె తండ్రి రామయ్యగారు ఒక ఆలయంలో పూజారి.
చిన్నప్పటి నుంచే ఆశ తన తండ్రి చేసే పూజలు చూస్తూ పెరిగింది.
ప్రతిరోజూ ఉదయం...
ఆమె తండ్రి కృష్ణుడికి పూలమాలలు వేసి, తిలకం దిద్దుతూ ఎంతో భక్తితో సేవ చేసేవారు. ఆశ కూడా పక్కనే నిలబడి చూస్తూ, "నాన్నా... నేను కూడా నేర్చుకుంటాను" అని చెప్పేది.
కాలం గడిచింది...
రామయ్యగారు వృద్ధాప్యంలోకి అడుగుపెట్టారు.
శరీరం సహకరించడం మానేసింది. చేతులు వణికేవి... నడవడమూ కష్టమైంది.
ఒక రోజు ఆలయ కమిటీ వారు వచ్చి,
"ఇకమీదట పూజలు మీ కుమారుడు చేయాలి" అని చెప్పినప్పుడు...
ఆ మాట రామయ్యగారి గుండెల్లో బాణంలా గుచ్చుకుంది.
ఆ రాత్రి ఆశ తన తండ్రిని అడిగింది:
"నాన్నా... మీరు ఎందుకు ఇంత బాధపడుతున్నారు?"
అప్పుడు రామయ్యగారు నెమ్మదిగా చెప్పారు:
"అమ్మా ఆశా... కృష్ణుడి సేవే నా జీవితం. ఇక ఆ సేవ చేయలేనని అనిపిస్తోంది."
ఆ మాట విన్న ఆశ గుండె కూడా బాధతో నిండిపోయింది.
తరువాతి రోజు...
రామయ్యగారు చివరి సారి ఆలయానికి వెళ్లి కన్నీళ్లతో పూజ చేశారు.
"ఓ కృష్ణా... ఇక నేను చేయలేను... నన్ను క్షమించు" అని చెప్పి ఇంటికి వచ్చేశారు.
ఆ రాత్రి ఆశ కూడా నిద్రపోలేకపోయింది.
ఆమె మనసులో ఒక్క మాటే---
"దేవుడు నిజంగా ఉంటే... నా నాన్నకి సహాయం చేస్తాడా?"
మరుసటి రోజు ఉదయం...
ఆశ తమ్ముడు ఆలయానికి వెళ్లి, ఆశ్చర్యంతో అరవసాగాడు---
"అక్కా! నాన్నా! త్వరగా రండి... అద్భుతం జరిగింది!"
అందరూ పరుగెత్తుకుంటూ ఆలయానికి వెళ్లారు.
చూసేసరికి...
ఎప్పుడూ నిలబడి ఉండే కృష్ణ విగ్రహం... ఇప్పుడు కూర్చొని ఉంది!
అది చూసిన రామయ్యగారు కన్నీళ్లతో కరిగిపోయారు.
ఆశ ఆశ్చర్యంతో అడిగింది:
"నాన్నా... ఇది ఎలా?"
రామయ్యగారు చిరునవ్వుతో చెప్పారు:
"అమ్మా... ఇది కృష్ణుడి కరుణ. నేను చేయలేనని తెలుసుకుని... ఆయనే తనను తాను నా దగ్గరకు తీసుకొచ్చాడు."
ఆ రోజు నుంచి...
రామయ్యగారు సులభంగా కూర్చుని పూజ చేయగలిగారు.
ఆశ కూడా తన తండ్రితో పాటు భక్తిని నేర్చుకుంది.
?? నీతి:
మనస్ఫూర్తిగా చేసే భక్తి ఎప్పుడూ వృథా కాదు...
దేవుడు దూరంగా ఉండడు... మనసెరిగి దగ్గరకు వస్తాడు. ??

రచన : తేరాల రాజేంద్రప్రసాద్
మీసేవ - బాబు జగ్జీవన్ రామ్ నగర్ (గిరినగర్),
హైదరాబాద్ - 37
చరవాణి: 9297109223

# క్యాన్సర్ నిరోధక టీకా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాణరక్షకమే



డా. నల్లి రవికుమార్

**నవతరం -పోలాకి**

పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ప్రధానంగా బాలికల్లో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించేందుకు వైద్యాధికారి డా. సుమ ప్రియా ఆధ్వర్యంలో చేపట్టబడింది.
ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి డా. నల్లి రవికుమార్ మాట్లాడుతూ, ఆరోగ్య శాఖ మార్గదర్శకాల మేరకు అర్హులైన 14 సంవత్సరాలు పూర్తిచేసుకున్న బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందజేస్తున్నామని తెలిపారు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. అర్హులైన బాలికలు తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. వ్యాక్సిన్ తీసుకున్న విద్యార్థులకు వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యార్థులు ఇతరులకు కూడా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పర్యవేక్షక సిబ్బంది మోహిని, శేఖర్ బాబు, సీహెచ్‌ఓ లక్ష్మీ, ఏఎన్ఎంలు విజయ, బాలామణి, ఆశా వర్కర్లు శైలజ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో దళితులు ప్రశాంత జీవనం: పీఎంజే బాబు

(నవతరం-శ్రీకాకుళం)

- దళిత సంక్షేమంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- వైకాపా పాలనలో అణచివేతలు జరిగాయని ఆరోపణ
- సూపర్ సిక్స్‌తో భరోసా కలిగిందని వ్యాఖ్య

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దళితులు ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారని టీడీపీ శ్రీకాకుళం పార్లమెంటు అధికార ప్రతినిధి పి.ఎం.జె. బాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దళిత సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఆయన తెలిపారు.గత వైకాపా ప్రభుత్వ పాలనలో దళితులు అన్ని విధాలా అణచివేతకు గురయ్యారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ కాలంలో అమలులో ఉన్న 27 దళిత సంక్షేమ పథకాలను వైకాపా ప్రభుత్వం రద్దు చేసి, దళితులను నష్టపరిచిందని విమర్శించారు.అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని రద్దు చేసి, ఆ పథకం పేరులో నుంచి డా. బీఆర్ అంబేద్కర్ పేరు తొలగించడం రాజ్యాంగ నిర్మాతకు అవమానమని అన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను మళ్లించారని, అమరావతి



రాజధాని నిర్మాణానికి అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు.

# గ్యాస్‌కు ఎందుకు ఎక్కువ వసూలు చేస్తున్నారు

## పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్



(నవతరం-శ్రీకాకుళం)

గ్యాస్ కు నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు తధ్యం అని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు.మంగళ వారం నాడు ఆయన నల్గొండ జిల్లా మునుగోడు లో గ్యాస్ కు అధికంగా వసూలు చేస్తున్న సాయి దుర్గ గ్యాస్ ఏజెన్సీ కి వారి ని నిలదేశారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..గరిష చిల్లర ధర కంటే ఎక్కువ వసూలు చేసే గ్యాస్ మాఫియా పై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఎండ లో గ్యాస్ వినియోగదారులను నిరీక్షణ చేయించడం భావ్యం కాదని మాచన రఘునందన్ స్పష్టం చేశారు.గ్యాస్ తమకు డోర్ డెలివరీ కావడం లేదు,అధికంగా వసూలు చేస్తున్నారు.అని పలువురు ఆరోపణ చేయగా వారి నుంచి లిఖిత పూర్వక ఫిర్యాదు తీసుకున్నారు.గ్యాస్ డెలివరీ సమయం లో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని రఘునందన్ వినియోగదారులకు స్పష్టం చేశారు.

# ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో "సా వి 3" సినిమా పోస్టర్ విడుదల

నవతరం టెక్కలి

ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీ లక్ష్మి క్రిష్ణ ఫిల్మ్ సిటీ యూనిట్ వారీ "సాం3 "మూవీ టైటిల్ మరియు పోస్టర్‌ను కళాశాల ప్రాంగణం లో డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరావు విడుదల చేశారు. ఈ చిత్రంకు డైరెక్టర్ క్రిష్ణ మాయ దర్శకత్వం వహించగా ప్రొడ్యూసర్ వి విజయ్.గా వ్యవహారిస్తున్నారు.
నటులు గా సామ్రాట్ రెడ్డి బిగ్‌బాస్ సీజన్-2 ద్వారా గుర్తింపు పొందిన నటుడు, లిఖిత రాను బొంబాయికిరాను, డిమాన్ పవన్ బిగ్ బాస్ ౦9,టెంపర్ వంశీలు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.
ఈ మూవీ షూటింగ్ ఐతం ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తూ, ఇచ్చాపురం మరియు శ్రీకాకుళం పరిసర ప్రాంతాలలో జరుపుతారని డైరెక్టర్ పేర్కొన్నారు.
ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ, కళాశాలలో సినిమా షూటింగ్ నిర్వహించడం ఆనందంగా ఉందని, చిత్ర యూనిట్‌కు భవిష్యత్తులో మంచి విజయాలు



సాధించాలని చిత్ర బృందాన్ని అభినందించారు.
ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తో పాటు ప్రిన్సిపాల్ డా ఎ ఎస్ శ్రీనివాసరావు,అల్యూమిన్ ఇంచార్జ్ డా డి. యుగంధర్, స్టూడెంట్ ఆక్టివిటీటీ ఇంచార్జి జె. సురేష్ కుమార్, డా డి విష్ణుమూర్తి, ఎస్టేట్ మేనేజర్ పిరియా రమేష్ కుమార్,ఎమ్ మురళీధర్,విద్యార్థులు మరియు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలి...

- టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి..
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ డిమాండ్...

(నవతరం-శ్రీకాకుళం)

అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు సాగు భూమి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈరోజు శ్రీకాకుళం స్థానిక తహసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల కావస్తున్నా హామీలు అమలు చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని, భూమి లేని నిరుపేదలకు సాగు భూమి పంపిణీ చేస్తానంటూ నమ్మబలికి అధికారంలోకి వచ్చిన




తరువాత వాటి ఊసే ఎత్తకపోవడం అన్యాయమని అన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని,ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేయాలని,భూమిలేని నిరుపేదలకు సాగు భూమి పంపిణీ చేయాలని,టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని, జిల్లాలో జరుగుతున్న భూమాఫియాని అరికట్టాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు పెన్షన్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి వసంతరావు, వై వేణు, లక్ష్మీ, మల్లేష్, కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిని నివారిద్దాం ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం!

## జిల్లా వైద్యాధికారి కె.అనిత

(నవతరం-శ్రీకాకుళం)

ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యాధికారి వారి కార్యాలయం నుండి స్థానిక ఏడు రోడ్ల కూడలి వరకు క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదాలతో ర్యాలీని కొనసాగించారు.
ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ టి.బి. ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా టిబి నివారణకు 100 రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 2.0 మిషన్లు, టిబి నాట్ మిషన్లు ఉన్నాయని ఈ వందరోజుల కార్యక్రమంలో భాగంగా 77 పంచాయితీలను 1000 మంది పాపులేషన్ లెక్కన తీసుకొని ఒకటి కంటే తక్కువ ఉన్న పంచాయతీలను టీవీ ముక్త పంచాయతీలుగా ఒకటి లేక ఎక్కువ కేసులు ఉన్న పంచాయతీని సిల్వర్ పంచాయతీగా ఒకటి లేక సున్నా ఉన్న పంచాయతీలను గోల్డ్ పంచాయతీలుగా నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. ఈ వ్యాధి బారిన పడినవారు క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడినట్లయితే వ్యాధి నివారణ జరుగుతుందని ఇందుకోసం టిబి సూపర్వైజర్లు ఉన్నారని, జిల్లాలో 9 యూనిట్లు ఉన్నాయని తెలిపారు. క్షయ వ్యాధి (ఒదీ) నివారణపై



ప్రజలకు అవగాహన కల్పించుట జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఇప్పటికి 506 కేసులు ట్రీట్మెంట్ లో ఉన్నాయని, టిబి కేసులు 12, మరియు టి.బి. హెచ్ఐవి కేసులు 12 ఉన్నట్లు తెలిపారు.
క్షయ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందని తెలిపారు.
సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని చికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ఈ వ్యాధి బారిన పడినవారు పోషకాహారం (పాలు, పండ్లు, కూరగాయలు)తీసుకోవాలని రోగ నిరోధక శక్తిని పెంచే అలవాట్లు పాటించాలని అన్నారు. ఒదీ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. ఈ టి.బి. వ్యాధి గ్రస్తులు సరైన మందులతో పాటు పోషకాహారం తీసుకోవాలని అందువలన ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా టి.బి రోగులకు వంద మందికి పోషకాహారం కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు టి. బి. నివారణ అధికారి టి. శ్రీకాంత్, వైద్యాధికారులు, ప్రభుత్వ రిమ్స్, జేమ్స్ ఆసుపత్రి (నర్సు) శిక్షణ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు మంత్రి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# గణగళ్ళపేటలో లైవ్‌లీ హుడ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం

(నవతరం-శ్రీకాకుళం)



యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రూరల్ మండలం పెద్ద గణగళ్లవాణిపేటలో నాబార్డ్ - ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం సహకారంతో లైవ్‌లీ హుడ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంను నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి రమేష్ కృష్ణ మంగళవారం ప్రారంభించారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ విశాఖపట్నం సాంకేతిక సహకారంతో 30 మంది మహిళా స్వయం సంఘాల సభ్యులకు ఫిష్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వాల్యూ అడిషన్‌లో 15 రోజులపాటు శిక్షణనిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షుడు మేడూరి ప్రసాదరావు మాట్లాడుతూ, ఈ శిక్షణానంతరం క్షేత్ర స్థాయి సందర్శన నిమిత్తం రీసెర్చ్ సెంటర్లకు తీసుకువెళతామని, అలాగే శిక్షణ అనంతరం యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకు రుణం కల్పిస్తామని చెప్పారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎల్డీఎం మాట్లాడుతూ, శిక్షణ పొంది యూనిట్లు ఏర్పాటు చేసుకున్న సభ్యులకు రుణం అందజేసేందుకు తమ బ్యాంకు నుంచి సహకారం అందిస్తామని తెలియజేశారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ నుంచి విచ్చేసిన భువనేశ్వర్, సతీష్, సుషీల్ కుమార్ ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామ సర్పంచ్ బర్రి రామారావు, ఎంపీటీసీ చీకటి అమ్మోజీరావు, గ్రామ పెద్దలు, సమృద్ధి సాగర్ మిత్ర సీఈవో పైడి వెంకటలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**